క్లుప్తంగా

కుప్పం ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన భరత్


భరత్

శాంతిపురం: ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా ఎస్ రెడ్డెప్పకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ఆశీర్వదించిన కుప్పం నియోజకవర్గ ఓటర్లకు ఎమ్మెల్సీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనపై పూర్తి సానుకూలతతో ఈ ఎన్నికలలో జనం తీర్పు ఇచ్చారని చెప్పారు. అవిశ్రాంతంగా శ్రమించిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కృషి చేసిన అధికారులను ఆయన అభినందించారు. రాష్ట్రంలో, కుప్పంలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఐదేళ్లలో సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు అన్ని హామీలను జగనన్న నిలబెట్టుకుంటామన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం తర్వాత కుప్పం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, శాశ్వత జల వనరుల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు.

పెరిగిన ఓటింగ్ శాతం

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలో సోమవారం జరిగిన శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగినట్లు తహసీల్దార్ వసంతలత తెలిపారు. మండలంలో సరాసరి ఓటింగ్‌శాతం 86.80కాగా, అత్యధికంగా దిన్నెపాటిలోని 259వ పోలింగ్ బూత్‌లో 94.03శాతం, కల్లూరులోని 234 బూత్‌లో 75.76శాతం నమోదైంది. ముఖ్యంగా మహిళలు, యువకులు ఉత్సాహంగా బారులు తీరి ఓటింగ్‌లో పాల్గొన్నారు. సోమవారం రాత్రివరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది.

సదుంలో 86. 39 శాతం పోలింగ్

సదుం: మండలంలో 86.39 శాతం పోలింగ్ నమోదు అయినట్టు అధికారులు ప్రకటించారు. మొత్తం 27,925 మంది ఓటర్లు ఉండగా 24,125 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు.

నైతిక విలువలపై నేటి నుంచి ఉచిత శిక్షణ

పలమనేరు: పట్టణంలోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల స్థాయి పిల్లలకు నైతిక విలువలపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కథ, ఆటపాటలు, పద్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు 9346249011 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి శిక్షణకు రావచ్చని తెలియజేశారు.

ఎంపీని కలిసిన నాయకులు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో ఉన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని మంగళవారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కలిశారు. ఎన్నికల సరళి గురించి ఎంపీ వారిని అడిగి తెలుసుకున్నారు. కలిసిన వారిలో ఎంపీపీ ఎల్లప్ప, ఈశ్వర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, మనోహర్ రెడ్డి, రమణారెడ్డి, రెడ్డెప్పరెడ్డి ఉన్నారు.

మారెమ్మకు ప్రత్యేక అలంకారం

పుంగనూరు: పట్టణంలోని శ్రీ విరూపాక్షి మారెమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై, నేతిదీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్రికెట్‌తో రిలాక్స్

కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి
గేమ్ ఏదైనా రఫ్ఫాడాలి
సేవల్లో అయినా..
రాజకీయంలో అయినా
ముందుండాలి..



అనే లెవెల్లో పలమనేరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే వెంకటేగౌడ మస్తుగా రిలాక్స్ అయ్యారు. ఇక్కడ చూస్తున్నారుగా బ్యాట్ పట్టుకుని క్రికెట్‌ను ఎలా మజా చేస్తున్నారో!? ఎన్నికలు సమీపించే కొద్దీ అవిశ్రాంతంగా ప్రచారం చేసిన ఆయన ఎన్నికలు ముగియడంతో హమ్మయ్య! ఓ పనై పోయింది బాబూ అనికుంటూ తన స్వగ్రామంలో అక్కడి యువకులతో కలసి ఉత్సాహంగా క్రికెట్ ఆడారు. సిక్సర్లూ బాదారు.

-పలమనేరు

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..!

- పెరిగిన ఓటింగ్ శాతం
- పోలింగ్‌కు పోటెత్తిన మహిళలు
- ఎవరిని నమ్మారు? ఎవరిని నమ్మలేదో గుంభనంగా ఉంటున్న ఓటర్లు
- పల్లెల్లో సాగిన సైలెంట్ ఓటింగ్
- ఎవరు గెలుస్తారోనని ప్రజల్లో చర్చ


వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడ


టీడీపీ అభ్యర్థి అమరనాథ రెడ్డి


ఓటేసేందుకు బారులు తీరిన మహిళలు (ఫైల్)

పలమనేరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మెజారిటీ స్థానాల్లో గెలిచి అధికారంలోకి రాబోతోందని పార్టీ నాయకులు, కాదు..తమదే అధికారం అని కూటమి నేతలు ఎవరికి వారు చెబుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో గెలుపెవరిదో పలు ఛానళ్లు మంగళవారం ఎగ్జిట్ పోల్స్ కథనాలు ప్రసారం చేశాయి . అలాగే సోషల్ మీడియాలో సైతం గెలుపు-ఓటములపై ఎవరికి వారు అనుకూలంగా హోరెత్తించాయి. ఎగ్జిట్ పోల్స్ ప్రజల్లో ఒకింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ పోల్స్‌తో గెలుపు తమదేనని ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఎన్నికల ఫలితాలకు మరో ఇరవై రోజులు గడువుంది. పోలింగ్ ముగియడంతో ఇప్పుడందరి దృష్టి ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే అంశంపై ప్రజల్లో చర్చకు తావిచ్చింది.

ఓటర్లు ఎవరి వైపో?

స్థానిక సాధారణ ఎన్నికల్లో ప్రజలు తమకు మరింత మేలు చేసే ప్రభుత్వమే రావాలని కోరుకుంటూ ఉంటారు. ఈ పర్యాయం ఎన్నికలు ఉత్కంఠ రేపాయి. ఒంటరిగా ఒకవైపు వైఎస్సార్ సీపీ, మరోవైపు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా బరిలో దిగడం ఎన్నికల వేడిని పెంచింది. తమ మేనిఫెస్టోలను ప్రకటించి ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేశాయి. అయితే మేనిఫెస్టో హామీలను ప్రజల్లోకి ఏ పార్టీ బలంగా తీసుకెళ్లింది? ఎవరు ఏ మేనిఫెస్టో హామీలను నమ్ముతున్నారు? దేనిని నమ్మడం లేదు? అనే వాటిపై సైతం చర్చలు జోరుగా సాగాయి. ఒక పార్టీ మేనిఫెస్టో విశ్వసనీయతతో కూడుకుని ఉందని, మరొకరిది ఓట్లను దండుకోవాలనే ఉద్దేశంతో ఇచ్చిన బూటకపు హామీలని పెదవి విరిచిన ఓటర్లూ లేకపోలేదు. ప్రజల నాడి చూస్తే తమకు అన్ని విధాలా మేలు చేసే ప్రభుత్వమే కావాలని, చెప్పినవన్నీ నెరవేర్చే నాయకుడే సీఎంగా ఉండాలని బలంగా కోరుకుంటున్నట్టు తేలింది. నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఈ పర్యాయం పెద్ద సంఖ్యలో బారులు తీరిన ఓటర్లు కనిపించడం అటు అన్ని పార్టీల నాయకులను ఆశ్చర్యపరిచింది. ప్రత్యేకించి మహిళలు పోటెత్తారు. వృద్ధులు, సామాజిక పింఛదారులు సైతం పెద్ద సంఖ్యలో వచ్చారు. అలాగే చంటిబిడ్డలతో సైతం తల్లులు వచ్చారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందారు కాబట్టే ఈ స్థాయిలో పోలింగ్‌కు వచ్చారని ఒక పార్టీ నాయకులు ఇక విజయం తమదేనంటూ లెక్కలేసుకున్నారు. ఇదంతా ప్రభుత్వ వ్యతిరేకత వల్లేనంటూ టీడీపీ శ్రేణులు చెప్పుకొచ్చాయి. అయితే ఎన్నికల సరళి మాత్రం అంచనాలకు మించి ఉండటం ఇప్పుడందరిలోనూ ఆసక్తి రేపింది. పథకాల పరంగా మహిళలు నేరుగా పొందిన లబ్ధి, ఆ లబ్ధితో ఆయా కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడడంతో తమకు మేలు చేసిన వారినే దీవించినట్లు కొందరు చెప్పారు. ఇక 2019 ఎన్నికల్లో 85.79శాతం నమోదు కాగా ఈ పర్యాయం మరింత పెరిగి 87.09 శాతం నమోదు కావడంపై రాజకీయ విశ్లేషకులు ఇది ఎవరికి అనుకూలిస్తుంది? ఎవరికి నష్టం కలిగిస్తుందో అంచనా వేసే పనిలో పడ్డారు. ఈ నేపథ్యంలో ఎగ్జిట్‌పోల్ అంచనాలు చర్చకు తావిచ్చాయి.

75వేల ఓట్లే కీలకం

పలమనేరు నియోజకవర్గంలో మైనారిటీ ఓటర్లు 29వేలు, ఎస్సీ(మాల)27వేలు, రెడ్డి 26వేలు మొత్తం 82వేల ఓట్లలో 90 శాతం ఏ పార్టీకి అనుకూలిస్తే వారిదే విజయమనే వాదన అప్పుడే మొదలైంది.

భవిష్యత్తును కోరుకున్న మహిళలు

ఎవరి హామీలు ఎలా ఉన్నా నియోజకవర్గంలోని మహిళలు తమకు పథకాలతోనే కాకుండా పిల్లల భవిష్యత్తుకు మంచి చేసే ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు.

ఏ మండలంలో ఎంతెంత?

మొదటి నుంచి టీడీపీకి కంచుకోటగా ఉన్న వి.కోట మండలంలో గత ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీకి మెజారిటీనిచ్చింది. పలమనేరు మున్సిపాలిటీతోపాటు రూరల్, బైరెడ్డిపల్లె, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో ఎవరి వైపు ఎక్కువగా మొగ్గుతారో ఫలితాలు చెప్పనున్నాయి.

పలమనేరు నియోజకవర్గ ప్రొఫైల్		
మొత్తం ఓటర్లు	:	2,67,896
పురుషులు	:	132653
మహిళలు	:	135243
ఇతరులు	:	0
పోలైన ఓట్లు, శాతం	:	2,35,476(87.09%)

మృత్యుంజయేశ్వరునికి సమర్పణ


దాతలతో మందహాసానికి పూజలు చేస్తున్న వేద పండితులు

చౌడేపల్లె: మృత్యుంజయేశ్వరస్వామి ఆలయానికి రాధాకృష్ణ, శిరీష దంపతులు, చౌడేపల్లె మాజీ సర్పంచ్ గాజుల పద్మావతమ్మ కలిసి మంగళవారం మందహాసంను సమర్పించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. దాతలను అర్చకులు ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు.

భక్తిప్రపత్తులతో మండల పూజ


పూజా కార్యక్రమాల్లో భక్తులు

సదుం: మండలంలోని తాటిగుంటపాలెం పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెలోని ఎల్లమ్మ ఆలయంలో మండల పూజా కార్యక్రమాలు మంగళవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయం నిర్మించి నలభై రోజులు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, విశేష అలంకారం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త దామోదర, వాసు, మధు, సర్పంచ్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

కుప్పంలో పెరిగిన పోలింగ్ శాతం


పాతపేట ఎంపీపీ పాఠశాల వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

- 90 శాతం ఓటింగ్
- ప్రభుత్వ సంక్షేమ పథకాలే కారణం

కుప్పం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో 2019 ఎన్నికల కంటే 2014 ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరిగింది. ఈసారి నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 2,25,775 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో 2,02,920 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019 ఎన్నికల్లో 85 శాతం పోలింగ్ నమోదు కాగా, 2024 ఎన్నికల్లో 90 శాతానికి పెరిగింది. 1,01,306 మంది పురుషులు, 1,01,608 మంది మహిళలు ఓట్లు వేశారు. కుప్పం రాజకీయ చరిత్రల్లో ఎప్పుడు 90 శాతం ప్రజలు ఎన్నికల్లో ఓటు వేసిన దాఖలాలు లేవు. సోమవారం ఉదయం నుంచి ప్రజలు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరి ఓట్లు వేశారు. ఈవీఎంలు మొరాయించి ఓటింగ్ ఆలస్యమైనా, ఎండలు మండుతున్నా ఓటర్లు మాత్రం ఓపికగా గంటల తరబడి క్యూలలో నిలబడి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

సంక్షేమ పథకాలు లబ్ధి ఓటింగ్ పెంచింది

5 ఏళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధి ఓటింగ్ శాతాన్ని పెంచింది. సంక్షేమ పథకాలన్ని మహిళలు వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో లబ్ధి పొందిన మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకుని ప్రభుత్వానికి తమ మద్దతు పలికినట్టు రాజకీయ పండితులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో 1,13,247 మంది మహిళా ఓటర్లు ఉండగా 101608 మంది తమ ఓటు హక్కు వినిగించుకున్నారు.

బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం


అభ్యర్థుల భవితవ్యం దాగి ఉన్న ఈవీఎంలు

- ఊపందుకున్న టీకొట్టు రాజకీయాలు
- గెలుపోటములపై ఆసక్తికర చర్చలు
- ఫలితాలు వెలువడే వరకూ ఎవరి ధీమా వారిదే

పలమనేరు: ఎన్నికలు ముగిశాయి. అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లోకి చేరింది. ఓటర్లు తమకు నచ్చిన నేతకు ఓట్లు వేసి రిలాక్స్ అయ్యారు. గెలుపుపై అభ్యర్థులకు ఎవరి అంచనాలు వారివే. అయినా ఫలితాలు వెలువడే వరకు రోజూ ఒకింత ఉత్కంఠే. ఇక పల్లెల నుంచి పట్టణాల్లోనూ గెలుపోటములపై టీకొట్టు బాతాఖానీ, ముచ్చట్లు ఎక్కువయ్యాయి. ఏ నలుగురు కలిసినా గెలుపెవరిదో? అనే దానిపైనే చర్చ సాగుతోంది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఒంటరిగా పోటీలో నిలవగా టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడి బరిలో దిగాయి. ఇక కాంగ్రెస్ పార్టీ కూటమికి తొత్తుగా మారిందనే విమర్శలు మూటకట్టుకుంది. కానీ పోటీ మాత్రం ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్యే సాగింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు మాత్రం గెలుపు తమదంటే తమదని ధీమా వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత పార్టీలకు చెందిన కార్యకర్తలు పోలింగ్ శాతం బట్టి లెక్కలు వేసే పనిలో పడ్డారు. మరికొందరు గెలుపోటములపై జ్యోతిష్యాలు కూడా చూసుకుంటున్నారు. ఇదే తరుణంలో ఎన్నికల ఫలితాలపై కాయ్ రాజా కాయ్‌లు ఎక్కువయ్యాయి. పల్లెల్లోనూ అభ్యర్థుల గెలుపోటములు, మెజారిటీ తదితరాలపై భారీగా బెట్టింగులు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడే దాకా అందరూ టెన్షన్‌గా గడపాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే విజేతలెవరో తేలేందుకు జూన్ నెల 4 ఉదయం 11 దాకా వేచి చూడాల్సిందే.

ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లకు నిరంతర విద్యుత్

- ట్రాన్స్‌కో ఏఈలకు డ్యూటీలు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని ఈవీఎంలు భద్రపరచిన కేంద్రానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. రోజూ రెండు షిఫ్టుల్లో ఏఈలు అందుబాటులో ఉంటారని, ఎలాంటి విద్యుత్ సమస్య వచ్చినా ఎప్పటికప్పుడు వారు పరిష్కరిస్తారన్నారు. వీరు జూన్ 4 వరకు విధులు నిర్వర్తిస్తారని చెప్పారు. జీడీనెల్లూరు, పైపల్లె, కేఆర్‌పల్లె, సంతపేట, పెనుమూరు, అరగొండ, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం, గిరింపేట, రెడ్డిగుంట, పలమనేరు రూరల్, బైరెడ్డిపల్లె, ఐరాల రూరల్, ఐరాల ఆపరేషన్, మిట్టూరు, కొత్తపల్లె, కార్వేటినగరం, పలమనేరు ఆపరేషన్, వి.కోట, యాదమరి, బంగారుపాళ్యం ఆపరేషన్, రూరల్, పూతలపట్టు, బంగారుపాళ్యం ఆపరేషన్, పాలసముద్రం, పైపల్లె, సంతపేట, కేఆర్‌పల్లె, పెనుమూరు, అరగొండ, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, రెడ్డిగుంట, గిరింపేట, బైరెడ్డిపల్లె, పలమనేరు రూరల్, ఐరాల ఆపరేషన్, రూరల్, పలమనేరు ఆపరేషన్, కార్వేటినగరం, యాదమరి, వి.కోట, పూతలపట్టు, బంగారుపాళ్యం రూరల్.. ఇలా మొత్తం 44 షిఫ్టుల్లో ఏఈలు పనిచేస్తారన్నారు. వీరిని ఈఈలు హరి, పద్మనాభపిళ్లై పర్యవేక్షిస్తారన్నారు.

వైభవంగా ధ్వజారోహణం


ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు

- ప్రత్యేక పూజలందుకున్న ఆధిశేషుడు
- తరలివచ్చిన భక్తులు

చౌడేపల్లె: స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదిశేషుడిగా పేరొందిన ఉత్సవ మూర్తులకు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ ధ్వజస్తంభాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేసి వేదపండితులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. ఈ పూజా కార్యక్రమాలను తిలకించడానికి పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ఉభయదారులుగా పద్మశాలి కులస్తులు వ్యవహరించారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

టీడీపీ దౌర్జన్యకాండ


పహరా కాస్తున్న పోలీసులు


ధ్వంసమైన కారు

- పెరుమాళ్లకండిగ్రలో పచ్చనేతల ఓవరాక్షన్
- బూత్‌కెళ్లే మార్గంలో పందిరి వేసిన వైనం
- ఓ మహిళపై దురుసుగా ప్రవర్తన
- ఆపై మహిళ ఇంటిపై దౌర్జన్యం
- అడ్డుకున్న వారిపై కర్రలు, ఇనుపరాడ్లతో దాడి
- కారు ధ్వంసం
- పహరా కాసిన పోలీసులు

చిత్తూరు రూరల్: అధికార దాహంతో టీడీపీ సార్వత్రిక ఎన్నికల్లో కుట్రలకు తెరలేపింది. ఓట్ల కోసం దౌర్జన్యానికి దిగింది. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు యత్నించడమే కాకుండా దాడులకు సైతం దిగింది. ప్రధానంగా ఇలాంటి ఘటనలతో పెరుమాళ్ల కండ్రిగలో సోమవారం రాత్రి వరకు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వివరాలు..చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగలో సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ సానుభూతి పరులపై టీడీపీ నాయకులు దాడికి దిగారు. కారణం..టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి పోలింగ్ బూత్‌కు 30 అడుగుల దూరంలో పందిరి వేసి రోడ్డుకు ఇరువైపులా కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. దీంతో బూత్‌కు వెళ్లే ఓటర్లకు ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా వాహనచోదకులు అవస్థలకు గురయ్యారు. ఓ మహిళ(వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలు) దీనిని ప్రశ్నించింది. దీంతో ఓ టీడీపీ నాయకుడు రెచ్చిపోయి..ఆమెను నోటికొచ్చినట్లు దుర్భాషలాడారు. ఈ ఘటన వివాదానికి దారితీసింది. టీడీపీ నాయకులు ఏకమై ఆ మహిళ ఇంటిపై దాడికి దిగారు. ఇంతలో ఆమెను కాపాడేందుకు వచ్చిన వారిపై కూడా టీడీపీ నాయకులు చేయిచేసుకున్నారు. ఇది కాస్తా ముదిరి ఉద్రిక్తతకు దారితీసింది. ఇంతలో పోలీసులు రోడ్డుకు అడ్డంగా ఉన్న పందిరిని తొలగించారు. దీనిని అవకాశంగా చేసుకుని పచ్చమూకలు రిగ్గింగ్‌కు స్కెచ్ వేశాయి. ఇది తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కొంత మంది బూత్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే టీడీపీ నాయకులు పెరుమాళ్ల కండ్రిగ గ్రామం వద్దే వాళ్లను అడ్డుకుని కొయ్యలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన స్టాన్లీ అనే అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. కారు అద్దాలను పగలగొట్టారు. పెరుమాళ్ల కండ్రిగలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రసాద్ నాయుడు ఇంటిపై కూడా దాడి చేశారు. రాళ్ల వర్షం కురిపించారు. ఇంట్లో సామాన్లను ధ్వంసం చేశారు. అంతేకాకుండా పక్క గ్రామాల్లోని టీడీపీ నాయకులను, చిత్తూరు నుంచి రౌడీలను రప్పించారు. వారంతా ఇనుప రాడ్లు, కొయ్యలతో ఇక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకున్నారు. టీడీపీ నాయకులను చెదరగొట్టారు. రాత్రంతా పహరా కాశారు. అయితే పరామర్శ పేరుతో టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌రెడ్డి పచ్చమూకలను మరింత రెచ్చగొట్టారు. ఇతని రాకతో గ్రామంలో పచ్చమూకల ఆగడాలు శృతి మించేలా ఉంటున్నాయి.

23న మొలకల పౌర్ణమి

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె బొమ్మసముద్రం ఎల్లమ్మ ఆలయంలో ఈనెల 23న మొలకల పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్టు గ్రామస్తులు తెలిపారు. గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, అమ్మవారి పుష్పపల్లకి ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

సత్యమ్మా.. వర్షాలు కురిపించమ్మా!

గుడిపాల: వర్షాలు పుష్కలంగా కురిపించి, పంటలు సమృద్ధిగా పండేలా దీవించాలని కోరుతూ మంగళవారం మండలంలోని బసవాపల్లె గ్రామస్తులు సత్యమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి, ప్రత్యేకంగా అలంకరించి, మొక్కుల చెల్లించారు. అనంతరం అభిషేకం నిర్వహించారు. పలువురు వివిధ వేషధారణతో ఆకట్టుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే కుప్పిగాని పల్లెలో గంగమ్మకు గ్రామస్తులు మొదటి వారం అంబలి పోసి, పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు.


బసవాపల్లెలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

వ్యతిరేకతే పోలింగ్ శాతానికి కారణం

- మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు: వైఎస్సార్ సీపీపై వ్యతిరేకతే పోలింగ్ శాతం పెరిగేందుకు కారణమైందని మాజీ మంత్రి, పలమనేరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పలమనేరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఎన్నికల ట్రెండ్‌ను బట్టి చూస్తే రాష్ట్రంలో ప్రజలు చంద్రబాబును కోరుకుంటున్నారని, ఆయన మేనిఫెస్టోను జనం నమ్ముతున్నారని, రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. విజయం తమకు దక్కడం ఖాయమన్నారు. ఎన్నికల్లో తాను భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.